కష్టాలు 'అప్‌డేట్'!

- రేషన్ కార్డు ఈ-కేవైసీకి దగ్గర పడుతున్న గడువు
- పిల్లల ఆధార్ అప్‌డేషన్ కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులుతీస్తున్న తల్లిదండ్రులు
- కేంద్రాల వద్ద సౌకర్యాలు లేక అవస్థలు
- సర్వర్ సమస్యతో నిదానంగా సాగుతున్న నమోదు కార్యక్రమం
- ఎండలో పిల్లలతో కార్యాలయం వద్ద పడిగాపులు

కోసిగి: మండలంలో ఆధార్ కార్డు కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆధార్ కార్డు లేనిదే ఏ పథకమూ వర్తించదు. పుట్టిన పిల్లలకు మూడు నెలల నుంచే ఆధార్ కార్డు నమోదు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అలాగే ఈనెల 31వ తేదీలోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ-కేవైసీలో చేతి వేలి ముద్రలు పడని వారి పేర్లు కార్డులో తొలగిపోయాయని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఆధార్ కార్డుల్లో చేతి వేలి ముద్రలు పడని 5 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలు మరోసారి ఆధార్ కార్డు అప్‌డేట్ చేసి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలతో ఆధార్ కేంద్రాల వద్ద క్యూకడుతున్నారు.

26 గ్రామాలకు రెండే ఆధార్ కేంద్రాలు

కోసిగి మండలంలో కోసిగి సచివాలయం-4లో, చింతకుంట గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దుద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రం పనిచేయడం లేదు. మండలంలో 26 గ్రామాలు ఉన్నాయి. 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలను ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకునేందుకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి చేరుతున్నారు. మూడు రోజులుగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పనులు మానుకుని తమ పిల్లలను తీసుకొని కార్యాలయం వద్దకు వచ్చి పడిగాపులు కాస్తున్నారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి కార్యాలయం వద్ద పడిగాపులు కాచిన అధికారులు సమయానికి రాలేదు. 10.40 గంటలకు కార్యాలయం వచ్చారు. అప్పుడు వందలాది మంది ప్రజలు ఒకే సారి గుమిగూడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే వేసవి కాలం కావడంతో ఎండలో ఆరుబయట ఉండలేక అవస్థలు పడ్డారు. కార్యాలయంలో కనీసం తాగునీటి వసతి కూడ లేక ఇబ్బందులు పడ్డారు. ఆధార్ అప్ డేట్ కోసం దుద్ది, కొల్మాన్‌పేట, ఆర్లబండ, అగసనూరు, జంపాపురం, సజ్జలగుడ్డం, ఐరన్‌గల్లు, జుమ్మాలదిన్నె, వందగల్లు, కామన్‌దొడ్డి, అగసనూరు, కందుకూరు తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకున్నారు. మరి కొందరు బెంగళూరు, గుంటూరుకు వలసవెళ్లిన వారు సైతం పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం పనులు మానుకుని కోసిగికి వచ్చారు.



కోసిగి సచివాలయం-4 ఉదయం 10.40 గంటలైనా తెరుచుకోక పోవడంతో ఎండలోనే ఎదురు చూస్తున్న ప్రజలు


చింతకుంటలో ఆధార్ నమోదు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ కృష్ణ

సర్వర్ సమస్య

ఆధార్ కార్డు అప్‌డేట్ చేసేందుకు ఆన్‌లైన్ సర్వర్ సమస్యలతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెట్‌వర్క్ నెమ్మదిగా ఉండటంతో రోజుకు 20 నుంచి 30కు మించి అప్‌డేట్ చేయడం కష్టంగా మారింది. ప్ర జలు ఎక్కువ సంఖ్యలో తరలి రావడంతో అధికారులు కూడా వేగంగా నమోదు చేయలేకపోతున్నామన్నారు. ప్రజలు ఎక్కువ రావడంతో వారికి చీటిలలో మూడు రోజులు, నాలుగు రోజుల తర్వాత రావాలని తేదీ ఇచ్చి పంపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరిన్న ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తొలగించాలని ప్రజలు కోరారు.

బెంగళూరు నుంచి వచ్చాను



బతుకు తెరువు కోసం బెంగళూరు పట్టణానికి వెళ్లి పనులు చేసుకుంటున్నాను. ఈనెల ఆఖరిలోగా పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయాలని చెబుతున్నారు. పనులు మానుకుని బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చాను. పిల్లలను తీసుకుని కార్యాలయానికి వస్తే ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదు.

– నరసింహులు, బొంపల్లి

మూడు రోజులుగా తిరుగుతున్నా



నా కుమార్తె అక్షయ కోసిగి వివేకనంద స్కూల్‌లో 1వ తరగతి చదువుతుంది. ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయాలని అధికారులు చెప్పారు. మూడు రోజుల నుంచి కోసిగి సచివాలయం -4కు తిరుగుతున్నాను. ఉదయం వచ్చిన 10.40 గంటలైనా అధికారులు రాలేదు. ఎండ వేచి ఉండ లేక ఇబ్బంది కరంగా మారింది. ఎక్కువ ప్రజలు ఉండడంతో చింతకుంట గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది.

– కృష్ణ, కొల్మాన్‌పేట

వేగవంతంగా జరిగేలా చూస్తాం



కోసిగి,చింతకుంట గ్రామాల్లో మాత్రమే ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల రోజుకు 200 మందికి పైగా వస్తున్నారు. దుద్ది, అగసనూరు గ్రామాల సచివాలయ ఉద్యోగులను కోసిగి ఆధార్ కేంద్రానికి కేటాయి ంచి ఆధార్ అప్‌డేట్ వేగవంతం చేయించేలా చర్యలు తీసుకుంటాం. డిజిటల్ అసిస్టెంట్స్ కార్యాలయ సమయంలోపే వచ్చేలా వారికి ఆదేశాలు జారి చేస్తాం.

– వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, కోసిగి

క్లుప్తంగా

పశువులను కోల్పోయిన రైతులకు పరిహారం


బాధిత రైతులు చెక్కు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: వన్యప్రాణుల దాడుల్లో పశువులను కోల్పోయిన రైతులకు బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ నష్ట పరిహారానికి సంబంధించిన చెక్కును పంపిణీ చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్ పరిధిలో 2023-24, 2024-25 సంవత్సరంలో 14 మంది రైతులకు రూ.1,79,600 సీఏఎంపీఏ-ఎన్‌పీవీ ద్వారా పరిహారం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదోనిలోని టీచర్స్ కాలనీ ఎంపీయూపీ స్కూల్ 2వ బ్లాక్‌లో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలలో బహుళ జాతీయ కంపెనీలైన అమర్‌రాజా గ్రూప్, అమిటీ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఎంపికైన నిరుద్యోగులకు రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 91774 13642, 99854 96587 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

గ్రామసభలో భూ సమస్యలను పరిష్కరించుకోండి


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్: భూముల రీసర్వేపై గ్రామాల్లో చేపట్టే గ్రామసభ ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. బుధవారం మండలంలోని కడితోటలో గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెకీ ఒప్పందాలు రద్దు చేయాలి

ఆదోని రూరల్: సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద విద్యుత్‌షాక్‌లు అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబునాయుడు మాట తప్పడం ఏమిటని ప్రశ్నించారు. మాట ప్రకారం విద్యుత్ చార్జీలు పెంచరాదన్నారు. ఈనెల 28వ తేదీన రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, మండల కార్యదర్శివర్గ సభ్యులు డి.రామాంజనేయులు, పట్టణ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ఆదోని రూరల్: మండలంలోని సంతెకుడ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చెన్నయ్య బుధవారం తెలిపారు. 33కేవీ లైన్ వైర్లు రీ ప్లేస్ చేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. దీంతో పెద్దహరివాణం, మదిరె, చిన్నహరివాణం, చిన్నగొనేహాల్, సంతెకూడ్లూరు, ఎడవల్లి, బలాదూర్, హానవాల్ గ్రామాల ప్రజలు గమనించాలన్నారు.

పీఆర్‌సీని అమలు చేయాలి

నందవరం: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు పన్నెండవ పీఆర్‌సీ అమలు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా కార్యదర్శి కాకె వెంకటేశప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో డీటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా వెంటాచలం, ఉపాధ్యాక్షులుగా పార్వతి, మాధవ గౌడ్, కార్యదర్శులుగా జయన్న, రాజేంద్రకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యాక్షులు కర్రె కృష్ణ, జిల్లా సెక్రెటరీ కాకే వెంకటేశప్ప వ్యవహరించారు.

పోటాపోటీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు


నామినేషన్లు దాఖలు చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు సాధారణ ఎన్నికల వేడిని తలపిస్తున్నాయి. అధ్యక్ష స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. ఈ స్థానానికి మధుసూదన్‌రెడ్డి పోటీ పడగా మరో ప్యానెల్ నుంచి సీనియర్ న్యాయవాది శ్రీరాములు బరిలో ఉన్నారు. బుధవారం ఇరు ప్యానెళ్ల నుంచి 8 నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇందులో మధుసూదన్‌రెడ్డి ప్యానెల్ నుంచి కార్యదర్శి స్థానానికి నెట్టికంటయ్య, ఉపాధ్యక్షుడి స్థానానికి లోకేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పదవికి ఖలందర్ బరిలో ఉండగా, శ్రీరాముల ప్యానెల్ నుంచి కార్యదర్శిగా జీవన్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా రాజారత్నం నామినేషన్‌లు వేశారు. గురువారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని సహాయ ఎన్నికల అధికారులు సోమశేఖర్, హనుమేష్ తెలిపారు.

ప్రజా సమస్యలపై ధర్నా

ఆదోని టౌన్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, సీనియర్ నాయకులు వీరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికి అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని కోరారు. అనంతరం సమస్యలపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వీరేష్, వెంకటేష్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కున్నూరులో తాగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు


తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గోనెగండ్ల : మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో అల్టియస్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీనాథ్ రెడ్డి, పురుషోత్తం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్యాలు బాగుండాలనే ఉద్దేశంతో అల్టియస్ సంస్థ సహకారంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రంను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోమేష్, సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ మద్దయ్య, అల్టియస్ ప్రతినిధులు రేణుక, నరసింహ, త్రిపాఠి, నాజియా, సుల్తానా, లక్ష్మీకాంత్, సీడీఎఫ్ సంస్థ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనే లక్ష్యం

కోసిగి: నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యాక్రమం చేపడుతున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. బుధవారం కోసిగి మండలంలోని డి.బెళగల్, కోసిగి, పెద్దకడబూరు మండలంలోని మేకడోనా , ముచ్చుగిరి, కల్లుకుంట, హెచ్.మురవణి, హనుమాపురం గ్రామాల్లో ప్రచార రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా దూరంగా ఉండి.. ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు ఉంటే సమాచారం ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


ప్రచార రథం ద్వారా అవగావన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

సమస్యలు పరిష్కరించండి

కౌతాళం: మండలంలోని సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండల సమస్యల పరిష్కారానికై ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రం కౌతాళంలో తాగునీటి సరఫరా 10-12 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారన్నారు. అలా కాకుండా రాజానగర్ క్యాంపు వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంకు నుంచి కౌతాళానికి ప్రత్యేక మోటరును ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, సత్యన్న, వీరేష్, ఉలిగయ్య, యంకన్న ఉన్నారు.


రథం ముందు కలశాలతో చిన్నారులు, మహిళలు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో పాపమ్మవ్వ

ఘనంగా పాపమ్మవ్వ రథోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని మరాఠీవీధిలో వెలిసిన పాపమ్మవ్వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాపమ్మవ్వకు పంచామృతాభిషేకం, ప్రత్యేకాలంకరణ పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల హక్కుల సాధనకై పాలక ప్రభుత్వాలపై ఉద్యమించేందుకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసి నెలకు రూ.3వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు తిమ్మగురుడు, విజయేంద్ర, సుంకన్న, శివకృష్ణ, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

గోనెగండ్ల : అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్ల స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల రుణాన్ని ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, కరుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం మండల నాయకుడు నబి రసూల్ అధ్యక్షతన సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ కుమారస్వామికి అందజేశారు. కార్యక్రమంలో దేవదాసు, ఖాజా, దాసు, నరసింహుడు, మునెప్ప, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మించండి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణం నుంచి కోసిగి ప్రధాన రహదారిలోని కమ్మలదిన్నె గ్రామం వరకు శిథిలమైన రోడ్డును డబల్ రోడ్డుగా పునర్నిర్మించాలని ఆర్‌వీఎఫ్, డీఎస్‌వైఏ నాయకులు ఖాజ, కృష్ణ, వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో డీఈ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఈ రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు రూ.22కోట్లు మంజూరు చేసిందని, కూటమి ప్రభుత్వం దానిని సింగిల్ రోడ్డుగా మార్చి నిర్మించేందుకు పూనుకోవడం సమంజసం కాదన్నారు.

జయప్రదం చేయండి

పెద్దకడబూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంచోది ఆదామ్ మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఏప్రిల్ 14న నియోజకవర్గ కేంద్రం మంత్రాలయంలో జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. జైభీమ్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గర్జి హనుమంతప్ప మాదిగ, నాయకులు బుజ్జప్ప, ఆనందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు 47 మంది ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని విక్టరి నవోదయ శిక్షణా కేంద్రం నుంచి జవహర్ నవోదయకు 47 మంది విద్యార్థులు 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఎంపికైనట్లు ఆ శిక్షణా కేంద్ర డైరెక్టర్ చాంద్‌బాషా తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ ఒకే కోచింగ్ సెంటర్ నుంచి 47 మంది ఎంపిక కావడం గర్వకారణన్నారు.

ముస్లింలపై కపట ప్రేమ

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్‌బోర్డ్ చట్టసవరణ బిల్లును రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యతిరేకించకుండా ముస్లింలపై కపట ప్రేమ చూపుతూ ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు రియాజ్ అహమ్మద్ ప్రశ్నించారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు వద్దని వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తే చాలని డిమాండ్ చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సబ్‌రిస్టార్ కార్యాలయాన్ని బుధవారం కర్నూలు రిజిస్టార్ శాఖ డీఐజీ కళ్యాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఓ వ్యక్తి తన స్థల అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆమెకు ఫిర్యాదు చేయగా.. సమస్యను పరిశీలించి తనకు గురువారం ఉదయానికి నివేదిక ఇవ్వాలంటూ సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులును ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో వంద శాతం వడ్డీ రాయితీ

ఎమ్మిగనూరుటౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్తి పన్నుపై విధించిన వడ్డీని పూర్తి స్థాయిలో మాఫీ చేసిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు గుర్తు చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ పాలక వర్గం కొలువుదీరి నాలుగేళ్లు పూర్తయినందున చైర్మన్ ఈసందర్భంగా సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, పట్టణ ప్రజలకు రంజాన్, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీలో 50 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని పేర్కొనడంతో.. వైఎస్సార్‌సీపీ సభ్యులు కలుగజేసుకొని వడ్డీని పూర్తిగా మాఫీ చేసిన ఘన త గత ప్రభుత్వానిదని గుర్తు చేశారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

అనంతరం సమావేశపు అజెండాలోని 43 అంశాలతో పాటు టేబుల్ అజెండాకు ఆమోదం తెలుపుతున్నట్లు వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ పేర్కొనగా.. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆర్ఓ అస్లాం బాషా, మేనేజర్ వరప్రసాద్, డీఈలు నీరజ, విక్టర్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదం మేరకు మార్కెట్ వేలాలు


కమిషనర్‌తో చర్చిస్తున్న కాంట్రాక్టర్‌లు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయాల మార్కెట్(జేఎల్‌బీ) వేలం పాటలు, నిర్వహణపై కౌన్సిల్ ఆమోదం మేరకు వేలం పాటలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో జేఎల్‌బీ మార్కెట్ వేలం పాటల్లో పాల్గొన్న కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌యార్డు పరిధిలో నడుస్తున్న జేఎల్‌బీ మార్కెట్‌ను పట్టణంలోకి తరలించాలని, ఆ పిమ్మట వేలంపాటలు నిర్వహించాలని కొంతమంది కాంట్రాక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మార్కెట్‌యార్డులో జేఎల్‌బీ మార్కెట్ వేలంపాటలు వేయడం వల్ల నష్టాలను చవి చూడాల్సి ఉంటుందని, తమ ఇబ్బందులు, ప్రజల ఇబ్బందుల దృష్ట్యా మార్కెట్‌ను పట్టణంలోకి తరలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వేలం పాటను తగ్గించాలని, తద్వారా కాంట్రాక్టర్లు వేలం పాటల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతారని కమిషనర్‌కు వివరించారు. దీంతో జేఎల్‌బీ మార్కెట్ వేలం పాటలపై ఈనెల 29వ తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశం అజెండాలో ప్రవేశపెట్టామని, కౌన్సిల్ ఆమోదం మేరకు తాము వేలంపాటలు నిర్వహిస్తామని కమిషనర్ సమాధానంగా తెలిపారు. కాంట్రాక్టర్లు జయరాం, తిమ్మప్ప, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కార్మికులకు దుస్తుల పంపిణీ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో శానిటేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ తదితర సెక్షన్లలో పని చేస్తున్న స్వీపర్లు, అటెండర్లకు ఎమ్మెల్యే పార్థసారథి చేతుల మీదుగా బుధవారం దుస్తులను, పనిముట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 174 మంది కార్మికులకు ఎమ్మెల్యే చేతులమీదుగా మహిళా కార్మికులకు చీరలు, రవికెలు, సబ్బులు, పురుషులకు యూనిఫాం (ఫ్యాంట్, షర్ట్), సబ్బులు, నూనెలు పంపిణీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బట్టలను పంపిణీ చేయడం జరిగిందని, త్వరలోనే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బట్టలు, సబ్బులు, నూనె పరికరాలను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు.


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ కమిషనర్

వ్యవసాయంపై అవగాహన అవసరం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు వ్యవసాయ అనుబంధ అంశాలపై తగిన అవగాహన కలిగి వుండాలని బనవాసి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుశీలమ్మలు అన్నారు. ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థులకు బుధవారం బనవాసి కేవీకేలో క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల అధ్యాపకులు, కేవీకే శాస్త్ర వేత్తలు చందన, జేజీకుమార్ తదితరులు మట్టి నమూనా పరీక్షలు, అజొల్లా పెంపకం తదితర వాటి గురించి వివరించారు.

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు





ఎండల నుంచి ఉపశమనం

ఎమ్మిగనూరుటౌన్: ఎండతీవ్రత రోజు రోజుకు పెరిగి పోతుండటంతో ప్రజలు బయటికి వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొంది. మార్కెట్లలో కొనుగోలు కోసం పట్టణానికి వచ్చే గ్రామీణులు, పట్టణ వాసులు మధ్యాహ్న సమయంలో ఏమాత్రం నీడ కనిపించినా సేద తీర్చుకునే పరిస్థితి. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన పలు సంస్థలు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహం తీర్చుతున్నాయి. ఎండల తీవ్రతకు స్థానిక కూరగాయల మార్కెట్‌లో కూరగాయాలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారు ఎండలకు అంగళ్ల ముందు నిలబడే పరిస్థితి లేకపోవడంతో మున్సిపల్ అధికారులు మార్కెట్‌లో ప్రవేశించే రెండు ద్వారాల నుంచి చలువ పందిళ్ల(గ్రీన్‌నెట్)లను వేయించారు. దీంతో కూరగాయల కొనుగోలుదారులు, వ్యాపారులకు కొంత ఎండల నుంచి ఉపశమనం పొందుతున్నారు. అదేవిధంగా సోమప్ప సర్కిల్‌లోని మెడికల్ షాపులకు గ్రామీణులు, రోగులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఆప్రాంతంలోనూ, శివ సర్కిల్ ప్రాంతంలో కూడా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గ్రీన్ నెట్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.